క్లుప్తంగా

రాముడిని దర్శించుకున్న యాదాద్రి కలెక్టర్



లింగాలఘణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హన్మంతారావు సోమవారం రాత్రి మండలంలోని జీడికల్ వీరాచల రామ చంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భార్గవాచార్యులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కాగా, ఎం.హన్మంతారావు గతంలో దేవాదాయ కమిషనర్‌గా పని చేశారు. ఈ నేపథ్యంలో వీరాచల రామచంద్రస్వామి చరిత్రను తెలుసుకుని ప్రత్యేకంగా దర్శించుకున్నారు.

ఎల్లమ్మతల్లికి ముక్కుపుడక అందజేత



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోని ఎల్లమ్మతల్లికి గ్రామానికి చెందిన తాళ్లపల్లి పెద్దోళ్ల కుమారస్వామి–ధనలక్ష్మి దంపతులు మంగళవారం రూ. 20వేల విలువైన ముక్కుపుడకను అందజేశారు. అర్చకుడు కరుణాకర్‌శర్మ వేద మంత్రాల నడుమ ముక్కుపుడకను ఇచ్చారు.

నేడు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

పాలకుర్తి: మండలంలోని దర్దేపల్లి గ్రామంలో ఈనెల 19వ తేదీ(బుధవారం) సాయంత్రం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు యువసేన అధ్యక్ష, కార్యదర్శులు రేగుల నరేశ్, రసాల మహేశ్ తెలిపారు. మంగళవారం పాలకుర్తిలో వారు మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విరాళం

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణానికి పట్టణ ముదిరాజ్ సంఘం సభ్యులు రూ.5వేల విరాళం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



ఖాజామియా మృతదేహం

పాలకుర్తి: వావిలాల గ్రామానికి చెందిన ఎండీ ఖాజామియా (45) మంగళవారం పాలకుర్తి బస్‌స్టేషన్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వావిలాలకు చెందిన ఖాజామియా పాలకుర్తిలోని వెల్డింగ్ షాపులో పని చేస్తున్న జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రోజుమాదిరిగా పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా బస్టాండ్ వద్ద గుండెనొప్పి రావడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడి సోదరుడు ఫకీర్ అబ్దుల్ ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అంజయ్య గుప్తా మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: పట్టణానికి చెందిన చిట్టిమల్లె అంజయ్య గుప్తా (82) మృతి వ్యాపార రంగానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి అన్నారు. మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన అంజయ్య మృతదేహానికి కనకారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. పట్టణంలో 50 సంవత్సరాలుగా అంజయ్య ఫర్టిలైజర్ షాపులు నిర్వహిస్తూ రైతులకు విశేషమైన సేవలు అందించారని కొనియాడారు. అహల్య, బూడిద గోపి, ప్రకాశ్, విజయేందర్ తదితరులు ఉన్నారు.

మహిమాన్వితుడు సిద్ధేశ్వరుడు

- బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

బచ్చన్నపేట: బచ్చన్నపేట మండలం కొడవటూర్‌లోని సిద్దుల గుట్టపై ఉన్న స్వయంభూ సిద్ధేశ్వరాలయం మహా శివరాత్రి పండుగ సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. భక్తుల కొంగు బంగారంగా కీర్తించబడుతున్న సిద్ధేశ్వరుడు వారు కోరిన కోర్కెలు తీరుస్తున్నాడు. చిన్న కొండపై వెలసిన శివలింగం ప్రతీ సంవత్సరం చింతాకు పరిమాణంలో పెరుగుతూ నిత్య పూజలు అందుకుంటోంది. ఆలయంలో గణపతి, భైరుడు, నవగ్రహాల దేవాలయాలు కూడా ఉన్నాయి. గుట్టపై మహంత స్వామి నివాసం ఏర్పరుచుకుని స్వామికి పూజలు చేస్తూ మహిమలు భక్తులకు వివరిస్తూ అక్కడే జీవనం కొనసాగించినట్లు ఇప్పటికీ ఆనవాళ్లు ఉన్నాయి. ఈ గుట్ట నుంచి బండనాగారంలోని రామలింగేశ్వరాలయం, కొన్నె గజగిరి గుట్ట, కొలనుపాకలోని సోమేశ్వరాలయానికి సొరంగ మార్గాలు కూడా ఉన్నాయి. సిద్దుల గుట్టలో 41 రోజులు ఉండి పూజలు చేసిన వారికి పలురకాల వ్యాధులు నయం అవుతాయని ఈ చుట్టుపక్క గ్రామాల ప్రజల విశ్వాసం. గుట్టపై ఉన్న గుండంలోని నీరును చేలలో చల్లితే ఎలాంటి చీడపీడలు ఆశించవని రైతులు తీసుకెళ్లి చల్లుతారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబతున్న ఆలయం..

ప్రతీ సంవత్సరం నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పర్వదినాన శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు. ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు చేపడుతారు. అగ్ని గుండాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు. కొడవటూర్‌కు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, సిద్దిపేట పట్టణాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు స్వామిని దర్శించుకునేందుకు వస్తారు.



ఆలయ గోపురం, (ఇన్‌సెట్‌లో) శివలింగం

ఉత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాశ్‌రావు

కొడవటూర్‌లోని స్వయంభూ సిద్ధేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు అధికారులకు సూచించారు. మంగళవారం నర్మెట సీఐ అబ్బయ్య, ఎంపీడీఓ మల్లికార్జున్‌లతో కలిసి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, కల్యాణ మండపాన్ని పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఆలయ ఈఓ చిందం వంశీ, ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ కృష్ణ, ప్రభుత్వ వైద్యురాలు ఝాన్సీ, ఆలయ ప్రధాన అర్చకులు ఓం నమఃశివాయ, పంచాయతీ కార్యదర్శి రూపాచైతన్య, ఆలయ సిబ్బంది లక్ష్మీకాంత్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శివరాములు, రాజయ్య, రాములు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి



పోస్టుకార్డులతో విద్యార్థులు

జనగామ రూరల్: త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో విద్యా రంగానికి ప్రాధాన్యత ఇచ్చి అధిక నిధులు కేటాయించాలని సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ కోరారు. మంగళవారం పట్టణంలోని ఏకశిల డిగ్రీ, గాయత్రి జూనియర్ కళాశాలల్లో విద్యా మహోద్యమంలో భాగంగా బడ్జెట్‌లో 15శాతం విద్యారంగానికి కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రికి విద్యార్థులు పోస్టుకార్డులు పంపించారు. విద్యార్థులు, సాదిక్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను నేడు (బుధవారం) డివిజన్ కేంద్రంలో నిర్వహించనుండగా ఉత్సవాల కన్వీనర్, డీఆర్డీఓ వసంత, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక పద్మావతి ఫంక్షన్‌హాల్‌లో నేడు ఉదయం 11 గంటలకు నిర్వహించున్న ఉత్సవాల ఏర్పాట్లపై నియోజకవర్గ గిరిజన నాయకులతో మాట్లాడారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఉత్సవాలను జయప్రదం చేసేలా అందరూ బాధ్యతగా పనిచేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీకాంత్, సతీష్, నియోజకవర్గ గిరిజన నాయకులు రాజేష్‌నాయక్, వెంకటేష్‌నాయక్, స్వామినాయక్, రమేష్‌నాయక్, శ్రీనునాయక్, చిరంజీవినాయక్, హుస్సేన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

'ఎమ్మెల్సీగా సరోత్తంరెడ్డిని గెలిపించండి'



ప్రచారం చేస్తున్న ధర్మారావు

చిల్పూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరోత్తంరెడ్డిని గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్,మండల అధ్యక్షుడు గంటి ఉపేందర్‌యాదవ్, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, రవీందర్ రెడ్డి, శ్రవణ్, రమేశ్, అశోక్, అనీల్ పాల్గొన్నారు.

రుణం స్వాహాపై ఫిర్యాదు

జఫర్‌గఢ్: కోనాయిచలం గ్రామ సంతోషిమాత మహిళా సంఘానికి సంబంధించి రుణం స్వాహా విషయంలో అప్పటి ఏపీఎం సత్యనారాయణ, వీఓఏ స్వాతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ప్రస్తుత ఏపీఎం కటకం రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కోనాయిచలం గ్రామానికి చెందిన సంతోషిమాత మహిళా సంఘం సభ్యులు 2021 జూన్ 18వ తేదీన బ్యాంక్ ఆఫ్ బరోడా జఫర్‌గఢ్ బ్రాంచి నుంచి రూ.4 లక్షల రుణం తీసుకోగా వీఓఏ స్వాతి రూ.లక్ష మాత్రమే వారికి ఇచ్చి మిగితా రూ.3 లక్షలు ఇవ్వలేదన్నారు. ఈ విషయంపై సభ్యులు ఆమెను అడుగగా వారికి రూ.లక్ష మాత్రమే మంజూరైందని తెలిపినట్లు చెప్పారు. కాగా, రుణం రికవరీపై విచారణ చేపట్టగా రూ.3 లక్షలు మహిళా సంఘం సభ్యులకు ఇవ్వకుండా అప్పటి ఏపీఎం సత్యనారాయణకు ఇచ్చినట్లు వీఓఏ స్వాతి చెప్పారని పేర్కొన్నారు. మహిళా సంఘానికి మంజూరైన రుణాన్ని సభ్యులకు మొత్తం ఇవ్వకుండా వారిని తప్పుదోవ పట్టించడంతో పాటు స్వాహా చేసిన విషయంపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వారి ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సీసీ ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న ఏపీఎం రవీందర్

నిబంధనల ఉల్లంఘనపై..

దేవరుప్పుల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న తరుణంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నిబంధనలు ఉల్లంఘించి బీఆర్‌ఎస్ పార్టీ ప్రభావితం కోసం హెల్మెట్లను పంపిణీ చేశారని తహసీల్దార్ మహిపాల్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మండల నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఉన్నతాధికారులకు సైతం తగు ఆధారాలతో ఫిర్యాదు చేస్తామన్నారు. బోనగిరి యాకస్వామి, బానోత్ రామచంద్రునాయక్, రెడ్డిరాజుల రమేశ్, బీసీసెల్, యూత్ విభాగం మండల అధ్యక్షుడు గణేశ్, పులిగిళ్ల వెంకన్న, దొపాటి రవి, నర్సయ్య, కాడబోయిన వెంకన్న ఉన్నారు.



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

సీజేఐటీలో ఉద్యోగ శిక్షణ



శిక్షణకు అర్హత సాధించిన విద్యార్థులతో ప్రతినిధులు

జనగామ: జనగామ మండలం యశ్వంతాపూర్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు ప్రాథమిక పరీక్ష చేయగా 65 మంది ఎంపికయ్యారు. శిక్షణకు అర్హత సాధించిన విద్యార్థులకు అడ్వాన్స్ టెక్నాలజీలో భాగంగా ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ ప్రాక్టీషనర్, మైక్రోసాఫ్ట్ ఏఈయూ ఆర్‌ఈ ఏఐ తదితర కోర్సులపై శిక్షణ ఇచ్చారు. దీంతో పాటు ఉద్యోగ పరిజ్ఞానానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. సీజేఐటీలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐసీటీ తెలుగు రాష్ట్రాల అధినేత బి.గోపాల్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థుల భవిష్యత్‌కు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టి.అషర్, కో ఆర్డినేటర్లు నీలిమ, సందీప్, డాలీ, అర్చన ఉన్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



పూజలో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తజన సందోహం నడుమ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, అన్నమనేని హనుమాన్‌ప్రసాద్–అనూష, జక్కనగారి వెంకట్‌సాయి–కీర్తనల ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, ధర్మకర్తలు గనగోని రమేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, గడ్డమీది వెంకటస్వామి, అశోక్‌పాల్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ప్రమాదాలు నివారించేందుకు మంగళవారం సీఐ గట్ల మహేందర్‌రెడ్డి బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన చౌరస్తాలో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న 10 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయని, చౌరస్తాలో ప్రమాదాలు నివారించేందుకు విస్నూర్, దర్దేపల్లి రూట్లలో బారికేడ్లు ఏర్పాటు చేసినట్ల తెలిపారు. మద్యం సేవించి, అతివేగంగా వాహనాలు నడపరాదని అన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఎస్సై దూలం పవన్‌కుమార్, పోలీస్‌సిబ్బంది రాజ్‌కుమార్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.



బారికేడ్లను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

ఆర్‌ఎంపీల సమస్యలు పరిష్కరించాలి



మహా ధర్నాకు వెళ్తున్న ఆర్‌ఎంపీలు

బచ్చన్నపేట: ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరించాలని ఆర్‌ఎంపీల సంఘం మండల అధ్యక్షుడు బండారి ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో తలపెట్టిన మహా ధర్నాకు ఆర్‌ఎంపీలు మండల కేంద్రం నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపాలని, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించాలని కోరారు. చక్రపాణి, మహేష్, భాస్కర్, కనుకయ్య, రాజు ఉన్నారు.

'కాంగ్రెస్ జెండా ఎగరాలి'



రాంబాబును సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రఘునాథపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని, గ్రామ, గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గబ్బెట, కోడూర్, రామన్నగూడెం, శ్రీమన్నారాయణపురం, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. బానాజీపేటలో గ్రంథాలయ చైర్మన్‌గా నియామకం కావడం పట్ల రాంబాబును పార్టీ నాయకులు శాలువాలతో సత్కరించారు. ఆయా సమావేశాల్లో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, నాయకులు నామాల బుచ్చయ్య, గొరిగ రవి, లోనె శ్రవణ్, గంగిడి లక్ష్మారెడ్డి, రచ్చ సోమనాథ్, కావటి బాస్కర్ యాదవ్; బంద కుమార్, షబ్బీర్ పాల్గొన్నారు.

పంటను ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

- బాధిత రైతు, గ్రామస్తుల డిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్ : సాగులో ఉన్న మొక్కజొన్న, పొగాకు పంటలను ధ్వంసం చేసిన పగిడిపల్లి ఎల్లయ్యపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలని మండలంలోని అక్కపెల్లిగూడెం గ్రామానికి చెందిన రైతు యార రాజు డిమాండ్ చేశారు. అక్కపెల్లిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. రఘునాథపల్లి మండలం కుర్చపల్లి శివారులో పగిడిపల్లి గోపయ్య–చంద్రకళ దంపతులకు చెందిన నాలుగెకరాల వ్యవసాయ భూమిని నాలుగేళ్ల క్రితం యార రాజు–అక్షయ దంపతులు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్నారు. కాగా, ఇటీవల గోపయ్య అన్న కుమారుడైన పగిడిపల్లి ఎల్లయ్య సదరు భూమిలో తనకు రెండెకరాల భూమి వస్తుందంటూ రభస చేస్తున్నాడు. ఈ క్రమంలో మూడ్రోజుల క్రితం ఎల్లయ్య కొందరితో వచ్చి రాజు సాగుచేసిన ఎకరం భూమిలో మొక్కజొన్న, అర ఎకరం పొగాకు పంటను పూర్తిగా ట్రాక్టర్‌తో ధ్వంసం చేశాడు. విషయం తెలుసుకున్న బాధిత రైతు గ్రామంలో పెద్దమనుషులను సంప్రదించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చేతికి వచ్చిన మొక్కజొన్న, పొగాకు పంట ధ్వంసమైందని, దాదాపు రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని వాపోయాడు. పంటలను అకారణంగా ధ్వంసం చేసిన ఎల్లయ్యతో పాటు సహకరించిన వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, పంట ధ్వంసానికి వినియోగించిన ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకోవాలని బాధిత రైతు పక్షాన గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మేడిద భూపాల్‌రెడ్డి, యార రమేష్, కొమురెల్లి, సోమిరెడ్డి, బుచ్చిరెడ్డి, కుమారస్వామి, సంజీవ, బొమ్మగాళ్ల ఏలియా, సోమయ్య, అఖిల్, పెండ్లి రమేష్, సత్తయ్య, శ్రీధర్, యార శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాధిత రైతు తదితరులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



జఫర్‌గఢ్: పరీక్ష సామగ్రితో విద్యార్థులు



జనగామ రూరల్: వెంకిర్యాలలో..

జఫర్‌గఢ్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధి పల్లె రాజిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తమ్మడపల్లి (జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సీతారామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సాయిరాజ్, ఉపాధ్యాయులు ఆరోగ్యరెడ్డి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

జనగామ రూరల్: హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారి అధ్వర్యంలో వెంకిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు దాత అమృత పరీక్ష సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవినాయక్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. శ్రీనివాస్, అంజిరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, సిద్ధులు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- డీఈఓ రమేశ్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపల్లి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.రమేశ్, జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆల్ఫోన్స్ హైస్కూల్‌లో మంగళవారం రాత్రి ఘనంగా పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఈఓ, సీఐ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విద్యను అసక్తిగా అభ్యసిస్తే అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆలరించాయి. జనరల్ కౌన్సిలర్ నిర్మలాజ్యోతి గోలమారి, ఎస్సై నరేశ్, ఎంఈఓ రఘునందన్‌రెడ్డి, కరస్పాండెంట్ నిర్మలాజ్యోతి, హెచ్‌ఎం మరియసుజాత, ఇన్నమ్మ, థామస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

మూడు ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ

దేవరుప్పుల: మండలంలోని నీర్మాల పరిధి వాగు మలుపు సమీపంలో వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా చేసే మూడు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైరు చోరీకి గురైంది. సోమవారం రాత్రి ఓ గద్దెతోపాటు స్తంభాలపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు దుండగులు ఎత్తుకెళ్లి మిగితా సామగ్రిని సమీప పొలాల్లో వేసి వెళ్లారు. వరిపంటలు పొట్టకు వచ్చే క్రమంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చోరీ విషయమై సింగరాజుపల్లి విద్యుత్ శాఖ ఏఈ నర్సింహులు, రైతులు ఇంటి మల్లారెడ్డి, మలిపెద్ది నవీన్, రాజశేఖర్‌రెడ్డి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కాపర్‌వైరు చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్